సాక్షి
విశాఖపట్నం
బుధవారం। 16। ఆగస్టు। 2023



కంటి ఆస్పత్రికి నేత్ర దానం

భెల్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న నర్సింగరావు నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి కుటుంబ సభ్యులు అందించారు. 8లో



ఏపీఎల్ పోరుకు సర్వం సిద్ధం

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్‌కు వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం సర్వసన్నద్ధమైంది. 12లో



పల్లె ముంగిటకు గోవిందుడు

ఇల వైకుంఠం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారు పల్లెవాసులకు మరింత చేరువ కానున్నారు. 12లో



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి రజని



ఉప్పొంగిన దేశభక్తి: త్రివర్ణ దుస్తుల్లో విద్యార్థినులు



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జేసీ విశ్వనాథన్, డీసీపీలు విద్యాసాగర్, ఆనందరెడ్డి

విశాఖ విజయపథం

- జీవీఎంసీ పరిధిలో రూ.122 కోట్లతో 650 అభివృద్ధి పనులు
- రూ.117 కోట్లతో 19 ప్రధాన రహదారుల విస్తరణ
- మరో రూ.135కోట్ల ప్రాజెక్టులకు సీఎం జగన్ ఇటీవలే శంకుస్థాపన
- రూ.10 కోట్లతో కైలాసగిరి అభివృద్ధి
- బీచ్‌రోడ్డులో రూ.8 కోట్లతో ఓషన్ డెక్
- స్వాతంత్య్ర దినోత్సవంలో ఇన్‌చార్జి మంత్రి విడదల రజని

మహారాణిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష మేరకు విశాఖ సమగ్ర అభివృద్ధికి పలు బృహత్తర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. పోలీస్ బ్యారెక్స్ మైదానంలో మంగళవారం జరిగిన 77వ స్వాతంత్య్ర దినోత్సవంలో ఆమె జాతీయ పతాకావిష్కరణ చేశారు. కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మలతో కలసి సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖలో అభివృద్ధి, సంక్షేమ, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జీవీఎంసీ పరిధిలో రూ.122 కోట్లతో 650 పనులు చేపట్టామని, ఇందులో 76 పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. నగరంలో రూ.117 కోట్లతో 19 ప్రధాన రోడ్లను విస్తరించి అందంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. జీవీఎంసీ పరిధిలో రూ.135 కోట్లతో అభివృద్ధి పనులకు ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. వీఎంఆర్డీఏ పార్కు వద్ద ఓషన్ డెక్ నిర్మాణానికి రూ.8కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రూ.10కోట్లతో కైలాసగిరి అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 75 లే అవుట్లలో **ప్లాట్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు త్వరలోనే పూర్తవుతాయన్నారు. రూ.175 కోట్లతో 3,580 ఎకరాల్లో ఈ ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక మౌలిక సదుపాయాల్లో భాగంగా రూ.200** కోట్లతో రోడ్లు, సీసీ డ్రైన్లు తదితర పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ, పి.రవీంద్రనాథ్, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీలు విద్యాసాగర్ నాయుడు, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు ఇలా..

జిల్లాలో ఈ ఏడాది అమలు చేసిన పథకాలు, చేపట్టిన అభివృద్ధిని మంత్రి విడదల రజని వివరించారు. ప్రస్తుతం రూ.ఆరు కోట్లతో 6 పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి. 'జనని సురక్ష యోజన' పథకంలో భాగంగా 2023లో 6,089 మంది గర్భిణులకు కాన్పు కింద రూ. 60.89 లక్షలు అందజేశాం. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఆసరా కింద చికిత్స అనంతరం 88,600 మంది రోగులకు రూ.48.36 కోట్లు అందించాం.

- విమ్స్ ఆవరణలో రూ.14.85 కోట్లతో 50 పడకల ఆయుష్ ఆస్పత్రి, రూ.16.4 కోట్లతో యోగా, నేచురోపతి కాలేజీ, శొంఠ్యాంలో రూ.6.67 కోట్లతో ఆయుర్వేదం ఫార్మసీ, మందుల పరీక్ష కేంద్రం నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభిస్తాం. కేజీహెచ్‌లో రూ.4 కోట్లతో సిటీ స్కానింగ్ మెషీన్, రూ.12 కోట్లతో ఎంఆర్ఐ స్కానింగ్ మెషీన్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం.
- జగనన్న అమ్మఒడిలో భాగంగా ఈ ఏడాది 1.70 లక్షల మందికి రూ.255 కోట్లు, మొత్తం నాలుగు విడతల్లో రూ.1,114 కోట్లు అందించాం.



వేడుకల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు



దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న మంత్రి రజని

- ఖరీఫ్‌కు 1479 క్వింటాళ్ల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించాం.
- వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 3,600 మంది పాడి రైతులకు రూ.10 కోట్ల నష్ట పరిహారం చెల్లించాం.
- వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద ఈ ఏడాది 12,173 మందికి రూ.12.17కోట్లు అందించాం. రూ.152 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.
- 2023–24లో 6,132 పొదుపు సంఘాలకు రూ.416.46 కోట్ల రుణ సదుపాయం కల్పించాం.
- సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో జగనన్న విద్యా దీవెన కింద 4,252 మందికి రూ.4.90 కోట్లు, జగనన్న వసతి దీవెన కింద రూ.4,238 మందికి రూ.3.95 కోట్లు మంజూరు చేశాం.
- బీసీ సంక్షేమ శాఖ పరిధిలో జగనన్న విద్యా దీవెన కింద 39,226 మందికి రూ.62 కోట్లు, వసతి దీవెన కింద 38,109 మందికి రూ.36 కోట్లు మంజూరు చేశాం.
- వైఎస్సార్ కాపు నేస్తం కింద 20,568 మంది లబ్ధిదారులకు రూ.30.85 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 1,456 మందికి రూ.21.68 కోట్లు అందించాం.
- జిల్లాలో 4,312 కొత్త రైస్ కార్డులు జారీ చేశాం.
- జిల్లాలో జల జీవన్ మిషన్ కింద రూ.38 కోట్లతో 212 పనులు చేపట్టగా..70 పనులు పూర్తయ్యాయి. జగనన్న కాలనీల్లో శాశ్వత మంచినీటి సరఫరాకు రూ.17.50 కోట్లు మంజూరు చేశాం.
- పద్మనాభం, శొంఠ్యాం రోడ్డు బీటీ లేయర్ నిర్మాణం కోసం రూ.6 కోట్లు కేటాయించాం.
- జగనన్న కాలనీల్లో 119 లే అవుట్లలో 7,664 ఇళ్లకు రూ.15.60 కోట్లతో విద్యుత్ సదుపాయం కల్పించాం.
- వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకంలో భాగంగా నెలకు 2.40 కోట్ల రాయితీతో 4,400 వ్యవసాయ బోర్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.
- రుషికొండ బీచ్‌ను రూ.7.32 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. ప్రసాద్ స్కీంలో భాగంగా సింహాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.53.69 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

వివిధ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు రూ. 24.28 కోట్ల విలువ గల ఆస్తులను మంత్రి విడదల రజని పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె సందర్శించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



అల్లిపురం: పోలీస్ బ్యారెక్స్‌లో జరిగిన వేడుకల సందర్భంగా ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఉత్తమ శకటాలతో పాటు విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ సేవలందించిన 11 మంది పోలీసులకు సేవా పతకాలతో పాటు 501 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. త్రివర్ణ వస్త్రధారణతో పలువురు చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



థింసా నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



దేశభక్తి గీతానికి నృత్య ప్రదర్శన



విద్యార్థుల విన్యాసం



జీవీఎంసీ శకటం(ప్రథమ బహుమతి)



విద్యా శాఖ శకటం(ద్వితీయ బహుమతి)



వీఎంఆర్డీఏ శకటం(తృతీయ బహుమతి)

జీవీఎంసీ శకటానికి మొదటి బహుమతి

వివిధ ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాల్లో జీవీఎంసీ మొదటి బహుమతి గెలుచుకుంది. విద్యాశాఖ రెండో బహుమతి, డీఆర్‌డీఏ, వీఎంఆర్డీఏలు మూడో బహుమతిని గెలుచుకోగా.. అగ్రికల్చర్ అండ్ ఉద్యానవన శాఖ కన్సోలేషన్ బహుమతి సాధించింది.







జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున నుంచి బహుమతులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఈవో చంద్రకళ, వీఎంఆర్డీఏ అధికారులు

సరుకు రవాణాలో కొత్త రికార్డుకు కృషి



జెండా ఆవిష్కరిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సీతంపేట: విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో జరిగిన వేడుకల్లో చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ గతేడాది పోర్టు రికార్డు స్థాయిలో సరుకు రవాణా చేసిందని.. భవిష్యత్‌లో కొత్త రికార్డును నెలకొల్పేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. అనంతరం పోర్టులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ముందుగా సీఐఎస్ఎఫ్ జవాన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

నగరాభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి

మేయర్ గొలగాని హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: నగర సమగ్ర ప్రగతికి సమష్టిగా కృషి చేస్తున్నామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 2022–23 ఏడాదికి సంబంధించి 1018 పనులను రూ.181.72 కోట్లతో చేపట్టగా.. ఇందులో 455 పనులను 61.57కోట్లతో పూర్తి చేశామన్నారు. 105 పనులు పురోగతిలో ఉన్నాయని, 87 పనులు ఆరంభ దశలో, 371 పనులు టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు. రూ.4.60 కోట్లతో 20 బస్సు షెల్టర్ల నిర్మాణాలు ప్రారంభించగా.. 12 పూర్తయ్యాయని తెలిపారు. 19 ప్రధాన రహదారులను విస్తరించేందుకు రూ. 117.23 కోట్ల ప్రతిపాదించామని.. ఇందులో 11 టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో మొదటి స్థానం సాధనే లక్ష్యంగా జీవీఎంసీ కృషి చేస్తోందన్నారు. అనంతరం విధుల్లో ప్రతిభ చూపిన పలువురు ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కె.సతీష్, కార్పొరేటర్లు బిపిన్‌కుమార్ జైన్, కోడూరు అప్పలరత్నం, అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీలో జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మేయర్, కమిషనర్

జనం లేరా..? వెయిట్ చేయండి..

- పార్టీ శ్రేణులపై చంద్రబాబు అసహనం
- జన సమీకరణకు నానాయాతన పడిన నాయకులు
- బాబు యాత్రతో బీచ్‌లో ఇబ్బందులు పడ్డ సందర్శకులు
- విజన్ పేరుతో మరో మోసానికి తెర తీసిన చంద్రబాబు
- ప్రశ్నలడిగేవారిని ప్రత్యేకంగా నియమించిన వైనం

సాక్షి, విశాఖపట్నం: 'ఏందయ్యా ఇది.. ముందే చెప్పాను కదా.. అయినా జనాల్ని తీసుకురాలేకపోయారా.? త్వరగా బీచ్ రోడ్ నింపండి. అప్పుడే చెప్పండి.. బయటికి వస్తాను...' పార్టీ నాయకులపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు గరం గరమయ్యారు. ఇండియా విజన్–2047 కార్యక్రమం పేరుతో మరో మోసపూరిత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చంద్రబాబు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ చేరుకున్నారు. సాయంత్రం 4 గంటలకు బీచ్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి పాదయాత్రగా ప్రారంభం కావాలి. కానీ.. నోవాటెల్ లో బసచేసిన చంద్రబాబు.. అక్కడికి జనం రాలేదని తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకుల్ని పిలిచి.. జన సమీకరణకు ఇంకా ఎంతసేపు టైం కావాలని అసహనం వ్యక్తం చేశారు. జనం నిండిన తర్వాతే వస్తానని చెప్పడంతో నేతలు హడావుడిగా పార్టీ శ్రేణులతో రోడ్డు నింపారు. అనంతరం తాపీగా బయటికి వచ్చిన బాబు.. గంటన్నర ఆలస్యంగా పాదయాత్ర మొదలు పెట్టారు.



ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

సందర్శకులకు ఇబ్బందులు

స్వాతంత్య్ర దినోత్సవం రోజున సందర్శకులు భారీగా బీచ్‌కు వచ్చారు. అయితే.. చంద్రబాబు కార్యక్రమం కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాయంత్రం 4 తర్వాత యథావిధిగా రాకపోకలు సాగిస్తామని పోలీసులు పర్యాటకులకు సర్దిచెప్పారు. కానీ చంద్రబాబు ఆలస్యంగా మొదలు పెట్టడంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెలవు రోజున ఇలా ఇబ్బంది పెట్టే కార్యక్రమాలేంటంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పల్లా.. ఫొటోలకు ఎరేంజ్ చెయ్...

పాదయాత్రగా వెళ్తున్న బాబుతో ఫొటోలు దిగేందుకు స్థానికులెవ్వరూ రాకపోవడంతో ఆయన విస్తుపోయారు. వెంటనే స్థానిక నేత పల్లా శ్రీనివాసరావుని పిలిపించి.. పాదయాత్ర చప్పగా సాగుతోందనీ.. విభిన్న వర్గాల వారు వచ్చి ఫొటోలు తీసుకునేలా ఎరేంజ్ చేయాలని హుకుం జారీ చేశారు. వెంటనే పల్లాతో పాటు ఇతర నాయకులు అదే పనిలో నిమగ్నమయ్యారు. ఒక లాయర్, ముస్లిం మహిళ, స్టూడెంట్.. ఇలా ఒక్కొక్కర్ని పిలిపించి చంద్రబాబుతో ఫొటోలు దిగేలా చేసి.. పక్కకు తోసేశారు.

మరో మోసపూరిత డాక్యుమెంటా.?

ప్రతిసారీ విజనరీ పేరుతో హడావుడి చేసే చంద్రబాబు.. ఈ ఎన్నికల ముందు కూడా అదే పల్లవి అందుకున్నారు. గతంలో విజన్–2020 పేరుతో జనాల్ని మభ్యపెట్టిన బాబు.. ఇప్పుడు విజన్–2047 పేరుతో డాక్యుమెంట్ విడుదల చేశారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన బాబు.... తన వద్ద సలహాదారులుగా వ్యవహరించిన వారితో కలిసి.. బాబు చైర్మన్‌గా గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్(జీఎఫ్ఎస్‌టీ) పేరుతో సంస్థ ప్రారంభించారు. సదరు సంస్థ రూపొందించిన డాక్యుమెంటే ఇది. ఈ కార్యక్రమానికి వచ్చిన కొందరు విద్యావేత్తలు, నాయకులు చంద్రబాబు హడావుడి చూసి నవ్వుకున్నారు. కొందరైతే.. 2020 అయిపోయింది.. ఇప్పుడు 2047 పేరుతో హడావుడా అంటూ గుసగుసలాడుకున్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి ఏపీని అభివృద్ధి చేయలేకపోయారు కానీ.. ఇప్పుడు ఇండియా విజన్ అని చెప్పడం విడ్డూరమంటూ ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా.. డాక్యుమెంట్‌పై సలహాలు, సందేహాలు అడిగేందుకు టీడీపీ నేతలే ప్రత్యేకంగా కొందర్ని ఎంపిక చేసుకున్నారు. వారికి ఏ ప్రశ్నలడగాలో ముందుగానే స్క్రిప్ట్ ఇచ్చేశారు. ప్రజలకు అనుమానం రాకుండా ప్రశ్నలడిగేవారిని అక్కడక్కడా కూర్చోబెట్టడం కొసమెరుపు. చంద్రబాబు తన ప్రసంగం ఆద్యంతం చర్విత చరణంగానే సాగింది. సమైక్యాంధ్రగా ఉన్నప్పుడే విశాఖని ఆర్థిక నగరంగా చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. హుద్ హుద్ గురించి చెబుతున్నప్పుడు జనం కూడా ఎన్నిసార్లు ఇది చెబుతారంటూ అసహనం వ్యక్తం చేశారు.

'ఢిల్లీ'కి ఫుల్ డిమాండ్!

- రెండ్రోజుల ముందు విమాన టికెట్లు దొరకని పరిస్థితి
- ఆ తర్వాత ముంబై విమానాలకు గిరాకీ
- 90 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో
- అంతర్జాతీయ కనెక్టివిటీ ఉండడమే కారణం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం–ఢిల్లీల మధ్య నడిచే విమానాలకు ఫుల్ డిమాండ్ ఉంటోంది. మరే విమాన సర్వీసుకు లేని ప్రయాణికుల తాకిడి వీటికి కనిపిస్తోంది. ఈ రెండు నగరాల మధ్య రోజుకు ఐదు సర్వీసులు నడుస్తున్నాయి. ఇవి ఉదయం 8.15 నుంచి రాత్రి 9.50 గంటల వరకు తిరుగుతున్నాయి. వీటిలో సీట్లు 95 శాతానికి పైగా నిండుతున్నాయి. ఒక్కోసారి ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 100 శాతం కూడా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో విశాఖపట్నం నుంచి ఢిల్లీ వెళ్లేందుకు రెండు రోజుల ముందుగా టికెట్లు దొరకడం లేదు. ఆ తర్వాత స్థానం విశాఖపట్నం–ముంబై విమాన సర్వీసులకు ఉంది. ఈ రెండు నగరాల మధ్య 90 శాతం పైగా ఓఆర్ ఉంటోంది. ఈ విమాన సర్వీసులకు కూడా ఒకట్రెండు రోజుల ముందుగా టికెట్లు లభించని పరిస్థితి ఉంది. ఇక విశాఖపట్నం–సింగపూర్ సర్వీసుకు కూడా మంచి గిరాకీ కనిపిస్తోంది.

ఈ విమాన సర్వీసుకు 80 శాతం వరకు ఆక్యుపెన్సీ కనిపిస్తోంది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు ఒక్క ఇంటర్నేషనల్ సర్వీసు మాత్రమే నడుస్తోంది. అందువల్ల ఇతర దేశాలకు వెళ్లాలంటే విశాఖ నుంచి నేరుగా విమానాలు లేవు. ఢిల్లీ, ముంబైల నుంచి ప్రపంచంలోని పలు దేశాలకు కనెక్టివిటీ ఉంది. దీంతో ఇక్కడ నుంచి డొమెస్టిక్ సర్వీసుల్లో ఢిల్లీ, ముంబైలకు వెళ్లి అక్కడ నుంచి ఆయా దేశాలకు విమానాల్లో చేరుకుంటున్నారు. ఫలితంగా ఈ విశాఖ విమానాశ్రయం నుంచి దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబైలకు వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా ఉమ్మడి ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉద్యోగ, వ్యాపార అవసరాలతో పాటు పర్యాటకంలో భాగంగా పెద్ద సంఖ్యలో విదేశాలకు రాకపోకలు సాగించే వారున్నారు. దీంతో ఈ నగరాల మధ్య ప్రయాణికుల రద్దీ పెరగడానికి దోహదపడుతోంది. విశాఖ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాల్లో ఢిల్లీ, ముంబై సర్వీసులకు అధిక డిమాండ్ ఉండడానికి ఇదే కారణమని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్. రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు. మరోవైపు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ప్రయాణికుల రద్దీకనుగుణంగా తగినన్ని సర్వీసులు పెంచేందుకు విమానాల కొరత ఉందని విమానయాన నిపుణులు చెబుతున్నారు.



పిడిగుద్దులు గుద్దారు.. సెల్‌ఫోన్ లాక్కొన్నారు..

- సాక్షి టీవీ రిపోర్టర్‌పై టీడీపీ కార్యకర్తల దాడి
- పోలీస్ స్టేషన్‌లో జర్నలిస్టుల ఫిర్యాదు


సీఐ కోరాడ రామారావుకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు సురేష్, జర్నలిస్టులు

సీతమ్మధార: ఆర్.కె.బీచ్‌లో మంగళవారం రాత్రి జరిగిన చంద్రబాబు నాయుడు సభ కవరేజీకి వెళ్లిన ఆరిలోవ జోన్ 'సాక్షి' టీవీ రిపోర్టర్ సురేష్‌పై టీడీపీ కార్యకర్తలు విచక్షణారహితంగా దాడి చేశారు. సుమారు 30 మంది వరకు దుర్భాషలాడుతూ సురేష్ సెల్ ఫోన్ లాక్కొని.. పిడిగుద్దులు గుద్దుతూ బయటకు నెట్టేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు వారించినా వినకుండా పెట్రేగిపోయారు. ఈ దాడిపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కోరాడ రామారావుకు జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. టీడీపీ గుండాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్షణికావేశం... ప్రాణం తీసింది


- అష్టాచమ్మ ఆటలో ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణ
- నెట్టేయగా సిమెంట్ అరుగు తలకు తగిలి ఒకరి మృతి
- పిఠాపురం కాలనీలో ఘటన


నారాయణరావు మృతదేహం

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో ఇద్దరి యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణం తీసింది. అప్పటి వరకు కలిసి అష్టాచమ్మ ఆడిన ఆ యువకులు ఆటలో తలెత్తిన చిన్నపాటి వివాదంతో పరస్పరం దాడికి దిగారు. దీంతో నారాయణరావు (28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గవరవీధి, ఆటోమోటివ్ ప్రాంతానికి చెందిన దవిల నారాయణరావు (28), మద్దిలపాలెం పిఠాపురం కాలనీకి చెందిన ఆర్.రాంబాబు (29) ఇద్దరూ స్నేహితులు. వివాహితుడైన రాంబాబు కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా అవివాహితుడైన నారాయణరావు పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వీరిద్దరూ పిఠాపురం కాలనీ మార్కెట్ సెంటర్ సమీపంలో బెట్టింగ్‌కు అష్టాచమ్మా ఆడారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య గొడవ చోటుచేసుకుంది. అష్టాచమ్మా పిక్కలను నారాయణరావు తన్నేయడంతో కోపానికి గురైన రాంబాబు అతని మోహంపై బలంగా కొట్టాడు. దీంతో వెనక్కిపడిపోయిన నారాయణరావుకు అక్కడి సిమెంట్ అరుగు తల వెనుక బలంగా తగలడంతో మరణించినట్లు సీఐ మల్లేశ్వరరావు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు రాంబాబు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

విధుల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులకు గుర్తింపు లభించింది. 77వ స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ చేతుల మీదుగా 501 మంది అధికారులు, ఉద్యోగులు ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు.


జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న శ్రీనివాస మూర్తి, డీఆర్వో, పి.శ్రీనివాస్, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్, రాజారత్నం, డీటీసీ, గంగమ్మ దిశ హెడ్‌కానిస్టేబుల్, బుచ్చిరాజు ఏఎంసీ ప్రిన్సిపాల్ (కుడి నుంచి ఎడమవైపు)


వి.రమ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, జీవన్ ప్రదీప్, ఈఎన్‌టీ సూపరింటెండెంట్, వి.శ్రీనివాసరావు, సీపీవో, కె.శ్రీదేవి, బీసీ వెల్ఫేర్ అండ్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, ఎల్.చంద్రకళ, డీఈవో, ఎస్.రూపవతి, గురుకులాల జిల్లా కోఆర్డినేటర్, జి.విజయ, మత్స్యశాఖ జేడీ, ఆర్.పూర్ణిమా దేవి, ఇన్‌చార్జి డీఎల్‌డీవో, జి.బాలకృష్ణ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ డీఐజీ, జె.మాధవి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ


పి.శివప్రసాద్‌రాజు, వీఎంఆర్డీఏ సీఈ, పి.నందిని జగదీష్ పాటిల్, వీఎంఆర్డీఏ ఓఎస్డీ, డి.లక్ష్మారెడ్డి, వీఎంఆర్డీఏ ఎస్టేట్ ఆఫీసర్, ఎస్.ఎస్.వర్మ, జీవీఎంసీ అదనపు కమిషనర్, వై.శ్రీనివాసరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్, వి.సన్యాసిరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్, జి.సత్యానందం, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్, బి.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్, టి.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి(పెందుర్తి), వి.కొండబాబు, వ్యవసాయ శాఖ టైపిస్ట్


జి.దిలీప్ చక్రవర్తి, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, పి.పాపారావు, మార్కెటింగ్ ఆఫీసర్, టి.వై.నాయుడు, హార్టికల్చర్ కన్సల్టెంట్, డి.హరిత, గాజువాక రైతు బజార్ సూపర్‌వైజర్, డి.అర్జున్, లీడింగ్ ఫైర్‌మన్(మర్రిపాలెం), సీహెచ్.వెంకట రమణమూర్తి, డ్రైవర్ ఆపరేటర్(చిట్టివలస), బి.బంగార్రాజు, ఫైర్‌మెన్(చిట్టివలస), సీహెచ్ శ్రీనివాస్ కుమార్, లీడింగ్ ఫైర్‌మన్(సూర్యాబాగ్), కె.శ్రీనివాసరావు, డ్రైవర్ (సూర్యాబాగ్), జె.శ్రీనివాసరావు, హోంగార్డ్(పెదగంట్యాడ)


కె.మంగునాయుడు, ఫైర్‌మన్(పెదగంట్యాడ), పోక్సో కోర్టు పీపీ కరణం కృష్ణ, స్వచ్ఛంద సేవకురాలు మమత, జీవీఎంసీ పీఆర్వో నాగేశ్వరరావు, చంద్రరావు, ట్రెజరీ శాఖ ఎస్టీవో, డాక్టర్ శిల్పా, కేజీహెచ్ అంకాలజిస్ట్, పెదిరెడ్ల శ్రీనివాసరావు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, 108,104 అధికారులు, సిబ్బంది

కలెక్టరేట్‌లో..


కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహానికి కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏవో ఈశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

వీఎంఆర్డీఏ ప్రగతికి కృషి


పతాకావిష్కరణ చేస్తున్న వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

దొండపర్తి: వీఎంఆర్డీఏలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో సంస్థ ప్రగతికి కృషి చేయాలని చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పిలుపునిచ్చారు. వీఎంఆర్డీఏ కార్యాలయం వద్ద ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సంస్థ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి సి.హెచ్. రంగయ్య, ప్రధాన ఇంజినీర్ ప్రసాదరాజు, ఈవో లక్ష్మారెడ్డి, సీఏవో నిర్మలమ్మ ఎస్ఈలు భవానీశంకర్ బలరామరాజు, డీఎఫ్‌వో శాంతిస్వరూప్ పాల్గొన్నారు.

క్రెడాయ్ ఆధ్వర్యంలో..


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ చైర్మన్ కె.ఎస్.ఆర్.కె.రాజు

క్రెడాయ్ ఆధ్వర్యంలో చైర్మన్ కె.ఎస్.ఆర్.కె.రాజు జాతీయ జెండా ఎగురవేశారు. మాజీ చైర్మన్లు నారాయణ, బి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఇ.అశోక్‌కుమార్, గోవిందరాజు, చిలుకూరి శ్రీనివాస్, గౌరవ కార్యదర్శి వి.శ్రీను, కోశాధికారి కె.వి.ఆర్.రాజు, సంయుక్త కార్యదర్శులు పి.నరసింహారావు, జి.కార్తీక్, కమిటీ సభ్యులు ఎం.కృష్ణమోహన్, ఎం.అమరేంద్రరాజు, కిరణ్‌కుమార్ రాజానా పాల్గొన్నారు.

విశాఖ రేంజ్ కార్యాలయంలో..



పెదవాల్తేరులోని రేంజ్ కార్యాలయంలో విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

-సాక్షి, విశాఖపట్నం

కంటి ఆస్పత్రికి నేత్ర దానం

అక్కిరెడ్డిపాలెం: భెల్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న సంస్థ కార్మికుడు మాడుతూరి నర్సింగరావు (53) సోమవారం ఆత్మహత్యకు పాల్పడడంతో ఆయన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి కుటుంబ సభ్యులు అందించారు. మృతదేహానికి మంగళవారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించే సమయంలో నర్సింగరావు మిత్రులు, భెల్ కార్మికులైన ఆల్సి అప్పలనారాయణ, కె.శ్రీనివాసరావు ప్రేరణతో మృతుని భార్య జయంతి, కుమార్తె అనుమతి మేరకు నేత్రాలను కంటి ఆస్పత్రికి అప్పగించారు. నర్సింగరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ముగిసిన పారా బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: రైల్వే స్టేడియం బ్యాడ్మింటన్ ఎన్‌క్లేవ్‌లో మంగళవారం పారా బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పలువురు పారా క్రీడాకారులు పోటీపడ్డారు. వీల్‌చైర్ అంశంలోనూ పారా బ్యాడ్మింటన్ ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కేటగిరిల్లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర జట్టుకు ఎంపిక కానున్నారు. పారాస్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో కే3ఎస్ ఫౌండేషన్, వీరుమామ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. మాజీ ఎంపీ రవీంద్రబాబు హాజరై జెండా వందనం చేసి పోటీలను ప్రారంభించారు.

డి-ఫార్మసీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీలో గల డి-ఫార్మసీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ చదివిన విద్యార్థులు ఈనెల 19లోగా దరఖాస్తులు పంపించుకోవచ్చు. ఓపెన్ స్కూల్ ఇంటర్ చేసిన వారు కూడా దీనికి అర్హులే. ఇందుకోసం www.apsbtet.in/pharmacy అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు ఫార్మసీ హెడ్ గోవర్ధనరావును నేరుగా కలవాలి.

రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం


మద్దిలపాలెంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం: గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. మంగళవారం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్, తిప్పల నాగిరెడ్డి, విశాఖ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, మాజీ మంత్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, అల్లు భానుమతి, కార్పొరేషన్ చైర్మన్‌లు జాన్ వెస్లీ, పిల్లా సుజాత, పిల్లి సుజాత, చొక్కాకుల లక్ష్మి, ముఖ్యనాయకులు సత్యనారాయణ రెడ్డి, చొక్కాకుల వెంకట్రావు, సీతంరాజు సుధాకర్, రవిరెడ్డి, పేర్ల విజయ చంద్ర, నండిపల్లి కృష్ణంరాజు, జోనల్ ఇన్‌చార్జులు అల్లంపల్లి రాజుబాబు, రెల్లి జానకీరావు, రామ్మూర్తి, వంకాయల మారుతీ ప్రసాద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కె.వి బాబా, జిల్లా అనుబంధ అధ్యక్షులు ఆడ్డాల కృపా జ్యోతి,బోని శివ రామకృష్ణ, మాన్యాల శ్రీనివాస్, పెంద్ర అప్పన్న, వానపల్లి ఈశ్వర్ రావు, బయ్యవరపు రాధ, ఉడా రవి, సతీష్ వర్మ , ద్రోణం రాజు శ్రీవాత్సవ్, సత్యాల సాగరిక, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, బిపిన్‌కుమార్ జైన్, అప్పలరత్నం, సుజాత, కో ఆప్షన్ సభ్యులు సేనపతి అప్పారావు, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో..


అబ్బురపరిచిన ఆర్పీఎఫ్ మోటార్ బైక్ విన్యాసాలు


ఆర్పీఎఫ్ నుంచి వందనం స్వీకరిస్తున్న డీఆర్ఎం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలోని రైల్వే ఫుట్‌బాల్ మైదానంలో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ జాతీయ జెండా ఆవిష్కరించారు. రైల్వే భద్రతా దళం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ సభ్యుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వాల్తేర్ డివిజన్ ప్రగతి పథంలో సాగుతోందని.. అమృత్‌భారత్ పథకం కింద డివిజన్ పరిధిలోని 15 స్టేషన్లను రీడెవలప్‌మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. రెండో లైన్‌లో భాగంగా కె.కె.లైన్‌లో 7 బ్లాక్ సెక్షన్, రాయగడ- విజయనగరం లైన్‌లో 6 బ్లాక్ సెక్షన్లను పూర్తి చేసినట్లు చెప్పారు. వాల్తేర్ డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆర్పీఎఫ్ సిబ్బంది ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్ కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జూలై టర్నోవర్ రూ.1,927 కోట్లు


ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా ఉక్కు త్రిష్నా మైదానంలో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ జెండా ఎగురవేసి సీఐఎస్ఎస్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జూలైలో రూ.1,927 కోట్ల రికార్డు టర్నోవర్ సాధించామన్నారు. ఈనెలలో మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ పునఃప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డి.కె. మహంతి, ఎ.కె.బాగ్చి, ఎస్.సి.పాండే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కరుణరాజు, వీఎంఎస్ అధ్యక్షురాలు నుపూర్ భట్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్‌తో పాటు వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌బీఐ ప్రాపర్టీ షో

పాల్గొననున్న ఎస్‌బీఐ చైర్మన్ దినేష్

దొండపర్తి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ప్రాపర్టీ షో నిర్వహించనున్నారు. ఎస్‌బీఐ గ్రూప్ చైర్మన్ దినేష్ ఖారా ప్రదర్శనను ప్రారంభించనున్నారు. అంతకు ముందు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా పలు సంస్థలకు బస్సు, లైఫ్ సేవింగ్ పరికరాలు అందించనున్నారు. ఉదయం 10.55 గంటలకు ఐఐఎంకు బస్సు అందించి ప్రారంభించనున్నారు. అలాగే కేజీహెచ్‌లో వైద్య పరికరాలు అందజేయనున్నారు.

జిల్లా కోర్టులో..


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

విశాఖలీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్, పి.నర్సింగరావు, బైపా అరుణ్ కుమార్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామ జోగేశ్వరరావు, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శ్రీదేవి, ఇతర నా యమూర్తులు ఎం.వెంకటరమణ, న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ పాల్గొన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సీనియర్ న్యాయమూర్తులు కందాల శ్రీనివాసరావు, చీమలపాటి శ్రీరామ్మూర్తి, తదితరులను ప్రధాన న్యాయమూర్తి ఘనంగా సత్కరించారు.

ఏసీఏ ఆధ్వర్యంలో

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో వైఎస్ఆర్ స్టేడియంలో స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. క్రికెటర్లలో నైపుణ్యం పెంచడానికి ఏపీఎల్ ఎంతగానే దోహదపడుతుందన్నారు. మౌలిక వసతుల కల్పనలో ఏసీఏ దేశంలోనే ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, వీడీసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్యదర్శులకు ఉత్తమ పురస్కారాలు


డాక్టర్ జి.లక్ష్మీశ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న శానిటేషన్ కార్యదర్శులు

దాబాగార్డెన్స్: పరదేశిపాలెం-2, గొడారిగోతులు, సత్తివానిపాలెం సచివాలయాల శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు ఉప్పల శ్రీను, చిట్ల రాజీవ్, బోని అనీల్‌కుమార్‌లకు ఉత్తమ పురస్కారాలు దక్కాయి. విజయవాడలో రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చేతులమీదుగా ఈ పురస్కారాలు స్వీకరించారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం


అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో శ్రీనివాసరావు

మద్దిలపాలెం: సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేందుకు ప్రతి ద్విచక్ర వాహనచోదకుడు విధిగా హెల్మెట్ ధరించాలని ఆర్టీవో ఆర్.సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాపిడో మేనేజర్ మురళి ఆధ్వర్యంలో మద్దిలపాలెం కూడలి వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలోభాగంగా ద్విచక్ర వాహనచోదకులకు మొక్కలు పంపిణీ చేశారు. రాపిడో రైడర్లకు ఆర్టీవో, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల చేతుల మీదుగా హెల్మెట్లు ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆర్టీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగాలంటే హెల్మెట్ ధరించడంతోపాటు, ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. అలాగే కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు బుచ్చిరాజు, శిరీషాదేవి, మన్మోహన్, సుమన్‌లతోపాటు, ద్వారకా ట్రాఫిక్ సీఐ కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్, ఏఎస్ఐ జోగారావు పాల్గొన్నారు.